క్లుప్తంగా

మానవసేవే ధ్యేయంగా వీహెచ్‌పీ

అర్ధవీడు: మానవసేవే ధ్యేయంగా విశ్వహిందూ పరిషత్ పనిచేస్తుందని పరిషత్ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రం అర్ధవీడులోని షిరిడీ సాయిబాబ మందిరంలో కే. బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, ఇన్‌చార్జి శివశంకర్ హాజరై ప్రసంగించారు. ప్రతి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వీహెచ్‌పీ కమిటీలు వేయాలన్నారు. నేడు దేశంలో జరుగుతున్న పరిస్థితులను గమనిస్తూ కార్యకర్తలు పని చేయాలన్నారు. కార్యనిర్వాహకులు సీ శివారెడ్డి, బీజేపీ నాయకులు జీవీ రమణరావు, సుబ్బారావు, కే. శేసగిరిరావు, వెన్నపూస వెంకటరెడ్డి, లింగారెడ్డి, మహిళ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల అదాలత్

కంభం: స్థానిక ఏబీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ వినియోగదారుల అదాలత్ నిర్వహించనున్నట్లు డీఈఈ శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి జిల్లా జడ్జి చైర్‌పర్సన్ ఎస్.విక్టర్ ఇమ్మానియేల్, సాంకేతిక సభ్యులు శ్రీనివాసరావు, ఆర్థిక సభ్యులు ఆర్సీహెచ్.శ్రీనివాసరావు, జిల్లా పర్యవేక్షణ అధికారి కె.వెంకటేశ్వర్లు, స్వతంత్ర సభ్యులు సునితలు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

పోటీ పరీక్షలు విద్యార్థులకు మేలు

గిద్దలూరు రూరల్: పోటీ పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రజాపిత బ్రహ్మకుమారి ప్రతినిధి సావిత్రి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న మేధాశక్తిని పెంపొందించుకునేందుకు పోటీ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి జైలు

గిద్దలూరు రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి కోర్టు జైలు శిక్ష విధించింది. గిద్దలూరు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి భరత్‌చంద్ర మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి రూ.10 వేల జరిమానాతో పాటుగా రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తున్నట్లు సోమవారం తీర్పునిచ్చారు. స్థానిక సీఐ కే సురేష్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించిన పోలీసులకు మద్యం తాగి వాహనాలు నడుతున్న ఇద్దరు పట్టుబడ్డారు. వారిపై కేసులు నమోదు చేసిన పోలీసులు కోర్టులో జడ్జి ఎదుట హాజరు పరిచారు. వారికి జైలు శిక్షతోపాటు జరిమానా విధించారు.


ఈ-కేవైసీ కోసం గుమికూడిన రైతులు


కార్యాలయంలో సిమెంట్ బెంచీలపై కూర్చున్న వృద్ధులు

రైతులకు ఈ-కేవైసీ పరీక్ష

- ఇక్కట్లు పడుతున్న రైతన్నలు
- ఈ- కేవైసీకి రేపే ఆఖరు తేది

గిద్దలూరు రూరల్: ఈ-కేవైసీ పేరుతో కూటమి ప్రభుత్వం రైతులకు చుక్కలు చూపిస్తోంది. రైతులు తమ పేర్లు ఈ-కేవైసీ జాబితాలో ఉన్నాయా లేదా అని వ్యవసాయశాఖ కార్యాలయం చుట్టూ పడిగాపులు కాస్తున్నారు. విద్యార్థులు ఏడాది పాటుగా ఎంతో కష్టపడి చదువుకుని పరీక్షల్లో పాస్ అయ్యామా లేదా అని తమ పేర్లను నోటీసు బోర్డులో ఎలా చూసుకుంటారో అలా రైతులు కూడా ఉత్కంఠగా జాబితా చూసుకుంటున్నారు. చదువురాని రైతులు మాత్రం అయ్యా తమ పేరు ఉందాలేదా ఒకసారి చూసి చెప్పండి అంటూ బతిమాలుకుంటున్నారు. రైతులకు ఈ-కేవైసీ తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు వారి పనులను పక్కనపెట్టి మరీ పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద ఉదయం నుంచి సాయింత్రం వరకు వేసి ఉంటున్నారు.


తమ పేర్లు నోటీస్ బోర్డులో ఉన్నాయా లేదా అని చూసుకుంటున్న రైతులు

పడిగాపులు కాస్తున్న రైతన్నలు..

కార్యాలయంలో ఈ-కేవైసీ చేయించే సిబ్బంది రావడం ఆలస్యం కావడంతో కార్యాలయంలోని సిమెంట్ బల్లలపై కూర్చుని ఉండిపోయారు. సిబ్బంది రావడంతో రైతులు కార్యాలయంలోని ఈ-కేవైసీ సిబ్బంది వద్ద పెద్ద ఎత్తున గుమికూడారు. తమ పేర్లు ఉన్నాయా లేదా అంటు సిబ్బందిని ఒకరి తరువాత ఒకరు ప్రశ్నించడం మొదలుపెట్టారు. దీంతో కార్యాలయ సిబ్బంది మీ గ్రామాలల్లోని రైతుసేవా కేంద్రాల వద్ద అయిన సరే ఈ-కేవైసీ చేయించుకోవచ్చని చెప్పడంతో ఆ విషయం మాకు తెలియదు గతంలో అయితే వలంటీర్లు వచ్చి సమాచారం ఇంటి వద్దకు వచ్చి చెప్పేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని రైతులు వాపోయారు. సరైన సమాచారం అందకపోవడం వల్లనే గిద్దలూరు వ్యవసాయశాఖ కార్యాలయానికి వచ్చామని రైతులు సమాధానం చెప్పారు. ఈ నెల 18వతేదీ ఆఖరు అని చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని 6655 మంది రైతులు ఉండగా అందులో 6499 మంది పూర్తి చేసుకున్నారు. 156 మంది పెండింగ్ ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలియజేస్తున్నారు. అసైన్డ్ భూములు, ఇనాం భూములు సాగుచేస్తున్న రైతులకు ఈ-కేవైసీ చేసేందుకు సాధ్యపడకపోవచ్చని తెలియజేస్తున్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

గిద్దలూరు రూరల్: పట్టణ మున్సిపల్ కమిషనర్‌గా ఈవీ రమణబాబు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గిద్దలూరులో కమిషనర్‌గా పనిచేసిన ఐ.శ్రీనివాసులును పిడుగురాళ్లకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నందిగామలో కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రమణబాబును ఇక్కడకు బదిలీ చేశారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బందితో పాటు చైర్మన్, కౌన్సిలర్లు, పలువురు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న రమణబాబు

ఉన్నగురువాయుపాలెం పశువైద్యాధికారిగా బ్రహ్మయ్య

పొదిలి రూరల్: మండలంలోని ఉన్నగురువాయుపాలెం పశువైద్యాధికారిగా డాక్టర్ బ్రహ్మయ్య బాధ్యతలు స్వీకరించారు. బ్రహ్మయ్య మర్రిపూడి పశువైద్యాధికారిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి దాక ఇక్కడ పశువైద్యాధికారిగా పని చేసిన డాక్టర్ మంచికల మణిశేఖర్ మర్రిపూడి మండలానికి బదిలీ అయ్యారు. పొదిలి వ్యవసాయాధికారిగా దేవిరెడ్డి శ్రీనివాసులురెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈయన మార్కాపురం ఏవోగా పని చేస్తూ బదిలీపై ఇక్కడ వచ్చారు. పొదిలి ఏవోగా పని చేస్తున్న జైన్‌లాబ్దిన్ బదిలీపై వెళ్లారు.

మార్కాపురం ఏవోగా బుజ్జిబాయి


బుజ్జిబాయి, ఏవో

మార్కాపురం: మార్కాపురం వ్యవసాయశాఖ అధికారిగా బుజ్జిబాయి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె పెద్దారవీడు మండలం వ్యవసాయశాఖ అధికారిగా పనిచేస్తూ బదిలీపై మార్కాపురం వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు పొదిలికి బదిలీపై వెళ్లారు.

అధికారులకు విశ్రాంత ఉద్యోగుల సన్మానం


ఉపఖజానా అధికారులను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

గిద్దలూరు రూరల్: పట్టణంలో ఉపఖజానా కార్యాలయంలో పనిచేసి ఒంగోలుకు బదిలీపై వెళ్తున్న ఉపఖజానా అధికారి వరకుమార్‌కు ఆయన స్థానంలోకి ఒంగోలు నుంచి వచ్చిన నాగేశ్వరరావులకు సోమవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో విశ్రాంత ఉద్యోగులు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఉపఖజానా అధికారిగా పని చేసి బదిలీపై వెళ్తున్న వరకుమార్ సేవలు మరువలేనివన్నారు. విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన పనులు సత్వరమే చేసి అందరి మన్ననలు పొందాడన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు పాలుగుళ్ల శివారెడ్డి, ఆదినారాయణ, భాస్కర్‌రెడ్డి, మూర్తయ్య, రంగయ్యలు పాల్గొన్నారు.

కాటమరాజు దేవాలయ అభివృద్ధికి కృషి


కమిటీ సభ్యులకు నాగాభరణం అందిస్తున్న పీఎల్పీ యాదవ్

మార్కాపురం: వేణుతల కాటంరాజు దేవాలయ అభివృద్ధికి కృషిచేస్తామని దేవస్థాన కమిటీ చైర్మన్ గుమ్మా గంగరాజు యాదవ్, ముఖ్య ప్రతినిధి పీఎల్పీ యాదవ్‌లు తెలిపారు. సోమవారం పట్టణ బీసీ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాటమరాజు గంగాభవానీ ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల యాదవులు, భక్తుల సహకారం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. తమవంతు వాటాగా రూ.1 కోటి దేవదాయ, ధర్మదాయశాఖ వారికి జమ చేస్తే మరో రూ.2 కోట్లు ఆ శాఖ తరుపున వారు కేటాయిస్తారన్నారు. పైవిషయంపై సంబంధిత అధికారులతో మాట్లాడామని తెలిపారు. అన్ని ప్రాంతాల వారికి ప్రాతినిధ్యం కలిప్తూ ఆలయ కమిటీలో వివిధ హోదాల్లో స్వచ్ఛందంగా సేవలు అందించేవారిని గుర్తించి పదవులు పంపిణీ చేస్తామని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనే కాకుండా కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల సహకారాన్ని కూడా పొందాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆలయ అభివృద్ధి, భోజనశాలను పరిశీలించిన పలు రాష్ట్రాల భక్తులు చూసి తమ వంతు సహకారం అందిస్తామని ముందుకు వచ్చినట్లు వారు తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఉన్నటువంటి శివునికి వెండి నాగాభరణాన్ని కమిటీ అధ్యక్షులు గుమ్మా గంగరాజుకు అందచేస్తున్నట్లు పీఎల్పీ యాదవ్ తెలిపారు. ఈసందర్భంగా కొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకొని వారికి నియామక పత్రాలు అందజేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శిగా బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, ఎం గురుప్రసాద్ యాదవ్, ఒంటేరు నాగేశ్వరరావు యాదవ్, ఉపాధ్యక్షుడిగా పాముల పోలురాజు యాదవ్, గంగుల ఎల్లయ్య యాదవ్, బండి రాజగోపాల్ యాదవ్, మెట్ల చెంచయ్య యాదవ్, ఈర్ల ఎర్రయ్య యాదవ్, పాముల పోలురాజు యాదవ్ తదితరులను నియమించారు. కార్యదర్శులుగా కాయకాకుల శ్రీనివాసులు యాదవ్, బి కృష్ణమూర్తి యాదవ్, ఓ లక్ష్మి నారాయణ యాదవ్‌లను ఎన్నుకన్నారు.

కంభం ఎస్టీవోగా ముత్యం


ఎస్టీవోగా బాధ్యతలు స్వీకరించిన ముత్యం

కంభం: కంభం ఎస్టీవోగా పీముత్యం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. యర్రగొండపాలెం ఎస్టీవోగా పనిచేసి బదిలీపై కంభం వచ్చిన సందర్భంగా ఆయనను ఎన్జీవో సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. అలాగే మార్కాపురం డివిజనల్ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న షేక్.మస్తాన్‌వలి కంభం సబ్ ట్రెజరీ కార్యాలయంలో విధుల్లో చేరారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా భారతిబాయి


డీటీకి అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

బేస్తవారిపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా జీ భారతిబాయి సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాచర్ల మండల రీ సర్వే డీటీగా విధులు నిర్వహిస్తూ బదిలీపై బేస్తవారిపేటకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీ షేక్ పర్వీన్ అర్ధవీడు మండల డీటీగా బదిలీ చేశారు. నూతన డీటీని తహసీల్దార్ జితేంద్రకుమార్, ఎంఆర్‌ఐ షేక్ సలీం, వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది శాలువ, పూలమాలలతో సన్మానించారు.


విద్యార్థినికి అభినందనలు


విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తర్లుపాడు: పదిలో ప్రతిభ చాటిన విద్యార్థిని అభినందించారు. మండలంలోని మీర్జపేట జెడ్పీ హైస్కూల్‌లో చదివిన పదో తరగతి విద్యార్థిని ఆర్ ప్రవల్లిక పదో తరగతి పరీక్షల్లో 565 మార్కులు సాధించి కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభా అవార్డు అందుకున్న నేపథ్యంలో సోమవారం గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించి అభినందనలు తెలియచేశారు. బాగా చదువుకుని ఉన్నత స్థానంలో స్థిరపడాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాన పడితే చాలు.. వెతలే !


పాతపాడులో ఓ వీధి దుస్థితి ఇలా..


పెదారికట్లలో రోడ్డు పక్కన నిల్వ ఉన్న చెత్తాచెదారం


కొనకనమిట్ల: మామూలుగానే ఆ రహదారులు అంతంత మాత్రమే. మరి కొద్దిపాటి వర్షం పడితే చాలు ఇక అంతే. మండలంలోని గొట్లగట్టు, పెదారికట్ల, గనివానిపాడు, పాతపాడు గ్రామాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఇటీవల రోజుమార్చి రోజు వర్షం పడటంతో రహదారులు చిత్తడిగా మారాయి. వాతావరణ ప్రభావంతో ఇటీవల కొన్ని రోజులుగా జల్లులతో కూడిన కొద్దిపాటి వర్షం పడుతున్నపటికి రెండు రోజులగా పలు గ్రామాల్లో కొద్దిపాటి వర్షం పడింది. దీంతో పలు మట్టిరోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. వర్షం నీరు నిల్వ ఉండడంతో మురికిగా మారి దోమలు వ్యాప్తి చెందడంతో పాటు దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఆయా వీధులను సిమెంటు రోడ్లుగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు హెచ్‌ఎం ఎంపిక


యోగా శిక్షణలో పాల్గొన్న హెచ్‌ఎం మస్తాన్

కొనకనమిట్ల: రాష్ట్రస్థాయి యోగా పోటీలకు మండలంలోని వెలిగండ్ల ఎంపీపీ మోడల్ స్కూల్ సీస్ హెచ్‌ఎం డాక్టర్ షేక్ గుంటూరు మస్తాన్ జిల్లా తరపున ఎంపికయ్యారు. 21 తేదీ అమరావతిలో యోగా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పొదిలి పురపాలక సంఘం నుంచి గత వారం జిల్లా యోగా పోటీలకు ఎంపికయ్యారు. అక్కడ యోగాలో నైపుణ్యం ప్రదర్శించిన మస్తాన్‌ను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ పొదిలి మున్సిపల్ కమిషనర్ కెవెల్ నారాయణరెడ్డి యోగా పోటీలకు ఎంపికయ్యేలా ఇప్పించిన యోగా శిక్షణ రాష్ట్రస్థాయిలో పాల్గొనేందుకు దోహదపడిందన్నారు. నిత్యం యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. యోగ వలన చక్కటి ఆరోగ్యం, శరీర దృఢత్వం పాటు మానసిక ఒత్తిడి దూరమవుతుందన్నారు. ఈసందర్భంగా పలువురు మస్తాన్‌ను పలువురు అభినందించారు.

పొదిలి.. సమస్యల లోగిలి!


మొదటి లైన్ వ్యూ


రెండో లైనులో మురికిగుంత ఇలా..

- సాగర్‌నీరు లేక ఇరవై ఏళ్లు
- పొదిలి విశ్వనాథపురంలో 1,2 లైన్లకు రాని సాగర్ నీరు
- మురికి గుంతతో అవస్థలు
- రోడ్డుపైనే చెత్త కుప్పలు

పొదిలి: ఎంతో పేరే ప్రఖ్యాతలు ఉన్న పొదిలి పట్టణం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. 20 ఏళ్లుగా తాగు నీటి కోసం అల్లాడుతూనే ఉంది. పట్టణం అంతా ఎటు చూసినా మురికి కూపంగా, చెత్తచెదారాలతో కనిపిస్తోంది. విశ్వనాథపురం నడిబొడ్డున ఉన్న కాలేజీ రోడ్డులోని మొదటి, రెండు లైన్ల వాసులు గత ఇరవై సంవత్సరాలుగా సాగర్ నీరు లేక అవస్థలు పడుతున్నారు. పురాతన కాలం నాటి పైపులైన్లు లీకులు కావడం, తుప్పు పట్టిపోవటంతో వాటిని బాగు చేయించే విషయమై ఎవరూ పట్టించుకోక పోవటంతో ఆ రెండు లైన్లోల నివాసం ఉండే వారికి మంచినీటి సమస్య అధికంగా ఉంది. ఆ రెండు లైన్లో కింద భాగాన కొంత మేర సాగర్ నీరు వస్తున్నప్పటికీ, అవి మురికిగా ఉండటంతో వాడుకోవడం లేదు. బుగ్గజలం నీరు వస్తున్నప్పటికీ అవి మోటార్లు ఉన్న వారికి మాత్రమే ఉపయోగపడుతున్నాయి. మంచినీటి అవసరాలకు మాత్రం బబుల్ నీటినే ఉపయోగించుకోవాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగర పంచాయతీ అయిన తరువాత అయినా సాగర్ నీరు వస్తుందని ఆశతో ఎదురు చూసిన స్థానికులు సంవత్సరాలు గడుస్తున్నా వారి ఆశ నెరవేర లేదు. నరసింహారెడ్డి కాంప్లెక్స్, స్టేట్ బ్యాంకు సమీపంలో, శివాలయం వద్దకు వెళ్లి సాగర్‌నీరు తెచ్చుకుంటున్నారు. అవి తెచ్చుకునే అవకాశం లేని కుటుంబాల వారు బుగ్గ జలం నీటినే వాడుకుంటున్నారు.

మురికి గుంతలు, చెత్తతో అవస్థలు..

రెండో లైనులో మంచినీటి సమస్యతో పాటు, మురికి గుంత సమస్య అదనం. నిత్యం ప్రజలు, వాహనాలు రాక పోకలు సాగించే సిమెంటు రోడ్డు చెత్త కుండిలా మారింది. ఈ దారిన విద్యార్థులు అధిక సంఖ్యలో రాక పోకలు సాగిస్తుంటారు. ఏళ్ల తరబడి సైడు కాలువల్లో మురికినీరు నిల్వ ఉండి, ముందుకు పోవటం లేదు. ఎక్కడికక్కడ నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. పలు గృహాల్లోకి మురికి నీరు చేరుతుండటంతో ఆగృహస్థుల బాధలు వర్ణనాతీతం. మురికిగుంత వద్ద వాహనాలు అటు ఇటు పోయేందుకు సరిపోయే రోడ్డు లేక ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త నగర పంచాయతీ కమిషనర్ అయినా స్పందించి సమస్యలు పరిష్కారం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నగర పంచాయతీ అధికారులు స్పందించాలి..



నగర పంచాయతీ అధికారులు స్పందించి సాగర్‌నీరు, మురికినీటి సమస్య తీర్చాలి. ఏళ్ల తరబడి అధికారులు పట్టించుకోకపోవడం మూలంగానే సమస్య పరిష్కారం కాలేదు. రూ.20 వేలు ఖర్చు చేసి పైపు కల్వర్టు ఏర్పాటు చేస్తే మురికి నీటి సమస్య పరిష్కారం అవుతుంది. అది కూడా పట్టించుకోక పోవటంతో ఆరోడ్డును రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

– బూదాల జాన్ ప్రకాశ్, వైఎస్సార్ సీపీ నాయకులు

సాగర్‌నీటి సమస్య తీర్చాలి..



మొదటి, రెండు లైన్లలోని సాగర్‌నీటి సమస్యను, మురికిగుంత సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రతిపాదనలు పంపించామని పలుమార్లు చెప్పినప్పటికీ పనులు మాత్రం జరగలేదు. ప్రధానమైన సాగర్‌నీరు లేకపోతే స్థానికులు మంచి నీటి కోసం అవస్థలు పడుతున్నారు. వెంటనే సమస్య పరిష్కారం చేయాలి.

– ఎం.రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి

నేటి నుంచి పొలం పిలుస్తోంది

బేస్తవారిపేట: మండలంలో ఈనెల 17వ తేదీ నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామని వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్ తెలిపారు. 17వ తేదీన జేబీకే పురం, చెట్టిచర్ల, 18న పూసలపాడు, ఒందుట్ల, 24న మోక్షగుండం, పందిళ్లపల్లె, 25న సలకలవీడు, కలగొట్ల, జులై 1న పీఓ పల్లి, చిన్న ఓబినేని పల్లె, 2న నేకునాంబాద్, చింతలపాలెం, 8న బేస్తవారిపేట, సోమవారిపేట, 9న పిటికాయగుళ్ల, కొత్తపల్లె, 15న జేసీ అగ్రహారం, పాత మల్లాపురం, 16న ఎంపీ చెరువు, ఖాజీపురం, 22న బసినేపల్లె, జెన్నివారిపల్లె, 23న అక్కపల్లె, పీవీ పురం, 29న గలిజేరుగుళ్ల, శింగరపల్లె, 30న కోనపల్లె, శింగసానిపల్లె, ఆగష్టు 5న పెంచికలపాడు, చెట్టిచర్ల, 6న మోక్షగుండం, పందిళ్లపల్లె, 12న పూసలపాడు, ఒందుట్ల, 13 సలకలవీడు, కలగొట్ల, 19న రెట్లపల్లె, పెద్ద ఓబినేనిపల్లె, 20న నేకునాంబాద్, చింతలపాలెం, 26న బేస్తవారిపేట, సోమవారిపేట, 28న పిటికాయగుళ్ల, వంగపాడు గ్రామాల్లో కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్

గిద్దలూరు రూరల్: బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని సాయిబాబా మందిరం ఆవరణలోని ఫంక్షన్ హాల్‌లో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా సెగ్గం శ్రీనివాసులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అప్పిశెట్టి ఉదయ్‌శంకర్, నారాయణ, పిడతల రమేష్‌రెడ్డి, గుమ్మారాముడు, తదితరులు పాల్గొన్నారు.